క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(బారకాసు) : నగరంలోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను పలువురు యథేచ్ఛగా ఆక్రమించి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో పాదచారులు నడిచేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈనెల 13వ తేదీన సాక్షి దినపత్రికలో 'ఫుట్‌పాత్‌లే వ్యాపార కేంద్రాలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాల తొలగింపు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. అందులో భాగంగా నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులో పలు దుకాణాలను తొలగించారు.

పౌష్టికాహారంపై అవగాహన



నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని కాకుపల్లి సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ జగదీశ్వరి, అంగన్‌వాడీ హెల్పర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ




నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని వెంకటేశ్వరపురంలో బ్లాక్‌బోర్డు మిత్రమండలి కార్యాలయంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. వికలాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు నరసాపురం ప్రసాద్ మాట్లాడుతూ డీఎస్‌ఓ వెంకటరమణ ఆర్థిక సాయంతో 50 మంది దివ్యాంగులకు బియ్యం, పప్పుధాన్యాలు, నూనె, గోదుమ పిండి వంటి సరుకులను అందజేసినట్లు వివరించారు.

వరద బాధితులకు 'డీకేడబ్ల్యూ' సాయం



నెల్లూరు (టౌన్) : విజయవాడ వరద బాధితులకు డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల విద్యార్థులు రూ.20 వేల నగదును సేకరించారు. దీంతో పాటు రూ.30 వేల విలువ చేసే బియ్యం, దుప్పట్లు, చీరలు, నిత్యావసర సరుకులు తదితర వాటిని సేకరించి ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ద్వారా వెంకటాచలం మండలంలోని కాకుటూరులో ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావుకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సునీత, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, భారతి, ప్రసన్న, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్ పాల్గొన్నారు.

పీపుల్స్ పార్క్ కమిటీ ఆధ్వర్యంలో..



నెల్లూరు(బారకాసు) : విజయవాడ వరద బాధితుల కోసం హరనాథపురంలోని పీపుల్స్ పార్క్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజకు రూ.72,500ను గురువారం అందజేశారు. ఈ మేరకు వారు కార్పొరేషన్ కార్యాలయంలో చెక్కును అందించారు. కార్యక్రమంలో సి.శ్రీనివాసులురెడ్డి, జెనెక్స్ కాలేజీ ప్రిన్సిపల్ వెంగళరెడ్డి, డి.రవీంద్రరెడ్డి, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సామగ్రి వితరణ



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెం హౌసింగ్ బోర్డుకాలనీలో ఉన్న సాయిసేవా సదన్ వృద్ధాశ్రమానికి విశ్వమాత సేవా ఫౌండేషన్ తరఫున మూడు టేబుల్స్, నాలుగు స్టీల్ బకెట్లు అందజేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దూబిశెట్టి కల్యాణి గురువారం తెలిపారు. దాతలు శీలం కుసుమ కుమారి, పల్నాటి మహేశ్వరప్రసాద్, మల్లీశ్వరి, జయశ్రీ, రాధా, అరుణ, సునీత, ఎన్.మధుల సహకారంతో వితరణ చేసినట్లు ఆమె తెలియజేశారు.



డైకస్ రోడ్డు సెంటర్‌లో..



డైకస్ రోడ్డు గాంధీ నగర్‌లో..

నగరం గుంతలమయం

- మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యం
- కంకర తేలి అధ్వానంగా రోడ్లు
- రాకపోకలకు ప్రజల అవస్థలు



పాదలకూరు రోడ్డు పద్మావతి సెంటర్‌లో రోడ్డు మధ్యలో ఏర్పడిన ఇలా..

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కంకర తేలి, గుంతలు పడి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్లపై ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాకాలంలో చిన్నపాటి చినుకులకు కూడా గుంతల్లో నీరు చేరి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో పాటు ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్ల మరమ్మతులపై దృష్టి పెట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

➡ నగరంలోని ముత్తుకూరు రోడ్డు కూడలి నుంచి చిల్డ్రన్స్‌పార్కు వైపు వెళ్లే జంక్షన్ వద్ద రోడ్డు గుంతలమయం మారడంతో ద్విచక్ర వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

➡ నగరంలోని పొదలకూరు రోడ్డులో పద్మావతి సెంటర్, డైకస్‌రోడ్డు, గాంధీనగర్ రోడ్డులో పలుచోట్ల గుంతలు ఏర్పడి కంకర రాళ్లు పైకిలేచి అస్తవ్యస్తంగా మారింది.

➡ నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీ, తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు కోసం రోడ్లను తవ్వుతున్న కాంట్రాక్టర్లు, పనులు పూర్తయిన వెంటనే ప్యాచ్ వర్క్‌లు చేయకుండా అలాగే వదిలేస్తున్నారని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

➡ కంకర తేలి, గుంతలు పడిన ప్రదేశాల్లో రోడ్లపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

➡ ముక్కు పిండి పన్నులు వసూలు చేసే నెల్లూరు నగరపాలక సంస్థ అధికారులు ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో..



గ్రామస్తుల ఆంక్షలపై దళితుల ఫిర్యాదు

నెల్లూరు(దర్గామిట్ట) : దళితులమైన తమపై గ్రామస్తులు ఆంక్షలు పెట్టారని మర్రిపాడు మండలం పొంగూరుకు చెందిన దళితులు కలెక్టర్ ఆనంద్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు కొప్పుల రఘుతో వెళ్లి కలెక్టర్‌ను కలిసి వారి బాధలు చెప్పుకున్నారు. పొంగూరు ఎస్సీ మాదిగవాడకు చెందిన తాము వినాయక చవితి పండగను పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరుపుకున్నామని, అందులో భాగంగా కులవృత్తి అయిన తప్పెట్లు, భజనల బృందాలతో ఊరేగింపుగా వెళ్తుండగా గ్రామంలోని అగ్ర కులస్తులు మాదిగలంటూ తమను బహిష్కరించడం, ఉద్దేశపూర్వకంగా ఆంక్షలు విధించినట్లు తెలిపారు. దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పొంగూరు గ్రామస్తులు

తిరుమలపై రాజకీయాలు చేయొద్దు

నెల్లూరు(బారకాసు) : తిరుమలను అపవిత్రం చేస్తూ, హిందూవుల మనోభావాలను దెబ్బతీసేలా తెలుగుదేశం రాజకీయాలు చేస్తోందని, ఇది తగదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల నూనెలు వాడారంటూ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల ఆరాధ్యదైవం వెంకటేశ్వరస్వామికి మచ్చ తెచ్చేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీటీడీని రాజకీయాలకు వాడుకోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి వందరోజులైందని, ఇప్పటి వరకు పాలక మండలిని ఏర్పాటు చేయలేదని, దీనిని బట్టి వారికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు.



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గ పరిధిలోని సౌత్ మోపూరు సెంటర్‌లో రూ.5 కోట్ల నిధులతో ములుముడి– తాటిపర్తి రోడ్డుకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి సీఎం చంద్రబాబుతో ప్రత్యేకంగా మాట్లాడి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

9న బీఎస్పీ మహాధర్నా

నెల్లూరు(బారకాసు) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల జనగణన నిర్వహించాలని కోరుతూ అక్టోబర్ 9వ తేదీన విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకి ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు పుష్పాంజలి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఓట్ల కోసం బీసీల కుల జనగణన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈవిషయాన్ని పక్కన పెట్టి మోసం చేస్తున్నాయన్నారు. దేశంలో ప్రతి పది సంవత్సరాలకు కులాల వారీగా సమగ్ర జనగణన జరగాల్సి ఉందన్నారు. అయితే కేవలం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జనాభా లెక్కలకు మాత్రమే ప్రత్యేక కాలమ్ కేటాయిస్తున్నట్లు తెలిపారు. బీసీల కుల జనగణన మాత్రం జరగడం లేదన్నారు. సక్రమంగా కుల జనగణన జరిగితే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 23వ తేదీన నగరంలోని ముత్తుకూరు రోడ్డు, హరనాథపురం ప్రాంతంలోని రాఘేగెస్ట్ ఇన్‌లో బీసీల కుల జనగణనపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అంతకు ముందు మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, భాస్కర్‌గౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ నేత ఆనం అనుచిత వ్యాఖ్యలు

నెల్లూరు సిటీ : గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టీటీడీ లడ్డూలలో నాణ్యతలేని నెయ్యిని వినియోగించారని, ఇందుకు కారణమైన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఈఓ ధర్మారెడ్డిలను ఉరితీయాలంటూ టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గత ఐదేళ్లలో తిరుమల ప్రసాదం కంపుకొట్టేదన్నారు. భక్తులు ఫిర్యాదులు కూడా చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నెయ్యి సరఫరా చేసే కంపెనీని మార్చారన్నారు. కర్ణాటక ప్రభుత్వానికి సంబంధించిన నందిని బ్రాండ్‌ను మార్చి మరొకరికి ఇచ్చారన్నారు.

ఆరోగ్య కేంద్రాల తనిఖీ

నెల్లూరు(అర్బన్) : నగరంలోని నవాబుపేట రైతుబజార్ ప్రాంతంలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, కిసాన్‌నగర్ ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. రోగులకు చేస్తున్న రక్త పరీక్షలు, టీబీ పరీక్షలు, వయోజనులకు టీబీ నివారణ వ్యాక్సినేషన్ తదితర వాటిపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు రక్తపరీక్షల సంఖ్యను పెంచాలన్నారు. ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లతో పాటు టీబీ నివారణ సిబ్బంది ఉయ్యాల వేణుగోపాల్, హెల్త్ సెంటర్ సీఓ వేణుగోపాల్, శివకుమార్ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారి మాలధారణ నేడు

నెల్లూరు(బృందావనం) : కరెంటాఫీస్ సెంటర్ వద్ద ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు అమ్మవారి 18వ అర్ధ మండల మాలధారణ కార్యక్రమం జరుగుతుందని ఆ దేవస్థానం ఈఓ జె.వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. మాలధారణ స్వీకరించే భక్తులు విచ్చేసి అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలన్నారు.

బెయిల్ మంజూరు

నెల్లూరు(క్రైమ్) : ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో రాజేష్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. శోదన్‌నగర్‌కు చెందిన రాజేంద్రప్రసాద్ ఈనెల 9వ తేదీన చెట్ల వద్ద శుభ్రం చేస్తుండగా మాజీ కార్పొరేటర్ రాజేష్ చేయిచేసుకున్న ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేష్ గురువారం కోర్టులో లొంగిపోవడంతో కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

ఆనం విజయకుమార్‌రెడ్డికి అభినందన



విజయకుమార్‌రెడ్డితో పలువురు నాయకులు

నెల్లూరు సిటీ : వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో గురువారం పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్పొరేటర్లు సత్తార్, బొబ్బల శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై వినతి

నెల్లూరు సిటీ : ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు కేపీరెడ్డి రాష్ట్ర రవాణశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో వారు గురువారం కలిసి పలు సమస్యలను వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ వైద్యం సరిగ్గా అందడం లేదన్నారు. కిడ్నీ, కేన్సర్‌తో బాధపడుతున్న వారికి అపరిమిత రెఫరల్ వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. జీఓ నంబర్ 114 ప్రకారం ఉద్యోగులకు అన్నిరకాల అలవెన్స్‌ను అమలు చేయాలన్నారు. నైట్ అవుట్ అలవెన్స్‌ను కూడా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రాధాకష్ణ, రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీపతి పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

కార్పొరేషన్ సెక్రటరీగా ఫజరుల్లా

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా ఎస్‌కే ఫజరుల్లా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ పొట్లూరి స్రవంతిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈయన బాపట్ల, మార్కాపురం, చీరాల, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. సాధారణ బదిలీల్లో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు సెక్రటరీగా నియమితులై బాధ్యతలు చేపట్టారు.



మేయర్ స్రవంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఫజరుల్లా

నృసింహుని సేవలో జడ్జి

నెల్లూరు సిటీ : రూరల్ మండలం నరసింహకొండలో వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామిని జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆమెకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం విశేష పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రంగనాథునికి చిత్రకూట ఉత్సవం

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారికి చిత్రకూట ఉత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఉభయదేవేరులతో సర్వాలంకార శోభితంగా కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు పర్యవేక్షించారు.



నైపుణ్యాలను పెంచుకోవాలి

నెల్లూరు (టౌన్) : నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకుంటారని సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకులు శారద తెలిపారు. స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ఆర్ఐఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యతగా భావించి జ్యూట్ బ్యాగులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు మాధవీలత, ప్రోగ్రామ్ ట్రైనర్ కల్యాణి, ఏఎంఓ సుధీర్‌బాబు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, అధ్యాపకులు శివయ్య, సమత, ప్రమీల, నిర్మల, కృష్ణతులసీ, విజయలక్ష్మి, సుధారాణి పాల్గొన్నారు.



జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణలో విద్యార్థులు

బెగ్గింగ్ గ్యాంగ్‌పై కేసు

నెల్లూరు(క్రైమ్) : చిన్నారులను చంకనెత్తుకుని భిక్షాటన చేస్తున్న మహిళలపై చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు నగరంలో బెగ్గింగ్ మాఫియాపై కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు డీసీపీఓ సురేష్ ఆధ్వర్యంలో ఏహెచ్‌టీయూ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక బృందంగా ఏర్పడి నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, వీఆర్సీ సెంటర్, కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ తదితర ప్రాంతాల్లో దాడులు చేశారు. చిన్నారులతో భిక్షాటన చేస్తున్న సంతపేట ఉయ్యాలకాలువ కట్టకు చెందిన నాగమ్మ, జొన్నవాడకు చెందిన కామేశ్వరి, విజయవాడకు చెందిన మహేంద్ర చౌదరీలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి విజయలక్ష్మి, లక్ష్మీనరసింహ, కె.సుప్రియ, కె.వెంకటరమణమ్మ, దేవేంద్ర, కల్యాణిలను సంరక్షించారు. విజయలక్ష్మి, సుప్రియ, వెంకటరమణమ్మలను బాలసదన్‌లో చేర్పించారు. కల్యాణి, నరసింహ, దేవేంద్రలను తల్లిదండ్రులకు అప్పగించారు. భిక్షాటన చేయిస్తున్న మహిళలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై పోలీసులు జువైనల్ జస్టిస్ యాక్ట్–2015 కింద కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఏహెచ్‌టీయూ ఏఎస్సై సతీష్, సిబ్బంది శ్రీహరి, ప్రసాద్, రాంబాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ టి.మాదవి, సభ్యులు నిహారిక, రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చిన్నారులను బాలసదన్‌కు తరలిస్తున్న పోలీసులు

సీఎండీకి వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : స్థానిక విద్యుత్‌భవన్‌లో ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావుకు ఏఐటీయూసీ, యునైటెడ్ ఎల్రక్టిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పలు సమస్యలపై గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీటర్ రీడర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిశోర్, యూనియన్ నాయకులు కృష్ణ, హజరత్ వలీ, వెంకటసుబ్బయ్య, ఫిరోజ్, విజయ్, నాని, చంద్‌బాషా ఉన్నారు.



కొండ్రెడ్డి పరామర్శ

నెల్లూరు సిటీ : 24వ డివిజన్ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త వడ్లమూడి సుబ్బయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా, వారి కుటుంబ సభ్యులను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి గురువారం పరామర్శించారు. సుబ్బయ్య కుమారులైన పెంచలయ్య, నాగరాజులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ ఇన్‌చార్జి ఉడత మురళి యాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలు కుమారి, నాగరాజు, చింతకుంట వెంకయ్య, వెంకట రమణయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.